


మండల్ జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 589.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,076 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఐశ్వర్య ప్రదాయినిగా బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బండ్లమ్మ వారి దేవాలయంలో శ్రావణమాసం ఆదివారం పురస్కరించుకుని అమ్మవారిని ఐశ్వర్య ప్రదాయినిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

అడెమ్మ తల్లికి స్వర్ణనేత్రాలు సమర్పణ



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామదేవత అడెమ్మ తల్లికి గ్రామానికి చెందిన మద్దుల శ్రీనివాసరావు కుమారుడు మద్దుల శ్రీరామచంద్రమూర్తి-పద్మప్రియ దంపతులు ఆదివారం స్వర్ణ నేత్రాలు సమర్పించారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఆర్యవైశ్యులు సామూహికంగా అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. స్వర్ణ నేత్రాలు సమర్పించిన దంపతులను అద్దేపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. రాజేష్, చంద్రకిషోర్, గోవిందరాజులు, సునీల్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

బాపట్లటౌన్: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిను పురస్కరించుకొని ఈనెల 26 నుంచి జిల్లాలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పాల్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబరాల్లో భాగంగా ఈనెల 26న జిల్లాలోని అన్ని కళాశాలలు, విద్యాసంస్థల్లో క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 18 నుంచి 60 ఏళ్ల లోపు క్రీడాకారులకు వయస్సు వారీగా వివిధ పోటీల నిర్వహణ, 29న 3కే ర్యాలీ నిర్వహణ, అత్యుత్తమ క్రీడాకారులకు సన్మానం, 30,31 తేదీల్లో క్రీడలకు సంబంధించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేయటం జరుగుతుందన్నారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

బాపట్లటౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం కృష్ణాష్టమి పండుగ సందర్భంగా రద్దు చేయటం జరిగిందని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించాలన్నారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ సందడిగా మారింది. పలు లాంచీల్లో పర్యాటకులు కొండలోని మ్యూజియానికి చేరుకున్నారు. అందులో బుద్ధుడి ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, తొమ్మిది అడుగుల బుద్ధుడి పాలరాతి విగ్రహం, మహా స్థూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, సింహళవిహార్‌ను సందర్శించారు. అనంతరం అనుపులోని యాంపి స్టేడియం, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నమూనా, ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం భారీగా పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించడంతో రూ.70వేల ఆదాయం వచ్చినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ



నరసరావుపేట: మహారాష్ట్ర జలగాంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ముగ్గురు కలిసి డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ ఆధ్వర్యంలో 5,184 మందికి లఖ్‌పతి దీదీ ప్రశంసా పత్రాలు అందించారు. సీఐఎఫ్ రుణాలు రూ.20లక్షలు, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ. 54.14కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.



భయం..భయంగా విధులు

కోల్‌కతా ఘటన తర్వాత ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యోగం చేయాలంటేనే భయంగా ఉంది. రాత్రిళ్లు అనుక్షణం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. మహిళా వైద్యుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వసతులు సమకూర్చాలి. అన్ని ఆస్పత్రుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రిళ్లు డ్యూటీలో ఉండే మహిళా వైద్యులు, నర్సింగ్ ఇతర సిబ్బంది భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, సామాజిక ఆరోగ్య కేంద్రం, వేమూరు



పటిష్ట భద్రత కల్పించాలి



విధులు నిర్వహించే ప్రదేశాల్లో మహిళా వైద్యులకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి. రాత్రిళ్లు ప్రజలకు సేవలందించేందుకు వైద్యసిబ్బంది విధుల్లో ఉంటారు. వారికి తప్పకుండా పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలి. కోల్‌కతా లాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ చంద్రిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చందోలు

కమ్ముకున్న విషవలయం

జిల్లాలో విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఇప్పటికే 93 డెంగీ కేసులు నమోదు
- గడిచిన 18 రోజుల్లో 28 పాజిటివ్‌గా నిర్ధారణ
- నిర్వీర్యమైన ఐహెచ్‌ఐ పోర్టల్
- పరిగణనలోకి రాని ప్రైవేటు వైద్యశాలల్లోని డెంగీ కేసులు
- అధికారికంగా పదుల్లో... అనధికారికంగా వందల్లో నమోదవుతున్న కేసులు
- డెంగీను బూచిగా చూపి లక్షల్లో వసూలు
- ఇప్పటికే ముత్తాయపాలెంలో ఒకరు మృతి
- పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యంతో దోమలు వృద్ధి



విష జ్వరాల విజృంభణతో జిల్లా వణుకుతోంది. పట్టణం, పల్లె అనే తేడాలేకుండా ప్రతిచోటా పారని మురుగు కాల్వలు.. కొండలుగా దర్శనమిస్తున్న చెత్త కుప్పలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి వ్యాధులకు పరోక్ష కారణమవుతున్నాయి. దీంతో ప్రతి గ్రామంలో డెంగీ వంటి విషజ్వరాలు నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పట్టించుకోక.. ప్రైవేటులో రూ.వేలల్లో చెల్లించుకోలేక పేదవాడు దేవుడిపైనే భారం వేసి రోజులు గడపాల్సిన దుస్థితి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారినా.. విషజ్వరాలతో జనం విలవిలలాడుతున్నా.. డెంగీ బూచి చూపి ప్రైవేటు ఆస్పత్రులు రోగుల జేబులు గుల్ల చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

బాపట్లటౌన్: పారిశుద్ధ్య లేమితో దోమల విజృంభణతో జిల్లాలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడాలేకుండా ప్రతి చోటా టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు కనిపిస్తున్నాయి. గడిచిన 20 రోజుల్లో జిల్లాలోని ఏరియా వైద్యశాలలు, పీహెచ్‌సీల్లో, సీహెచ్‌సీలో కలిసి వేల సంఖ్యలో ఓపీలు నమోదు కాగా జిల్లాలోని ప్రైవేట్ వైద్యశాలల్లో అంతకు రెట్టింపు ఓపీలు నమోదవుతున్నాయి. విష జ్వరాలతో ప్రజలు విలవిలలాడుతున్న జిల్లా యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం వైద్యం పడకేసింది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం లాంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. విషజ్వరాలు ప్రబలి ఊరంతా మంచం పట్టిన తర్వాత క్యాంపులు పెట్టడం, శానిటేషన్, ఫాగింగ్ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..

జిల్లాలో 20 రోజుల క్రితం వర్షాలు కురిశాయి. గడిచిన 15 రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆదివారం జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. కొద్దిపాటి వర్షానికే పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి మురుగుగుంటలుగా మారాయి. చెత్త తరలింపు సక్రమంగా లేకపోవడం పట్టణం, పల్లె తేడా లేకుండా ఏ వీధి చూసినా చెత్తా, చెదారం నిల్వలతో దర్శనం ఇస్తున్నాయి. డ్రెయిన్లలో మురుగునీరు పారుదల లేక దుర్గంధం వెదజల్లుతుంది. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్ల లీకేజీలతో రక్షితమంచినీరు సైతం కలుషితమవుతోంది. ప్రతికూల పరిస్థితులకు తోడు నియంత్రణ చర్యలు కొరవడటంతో విషజ్వరాల వ్యాప్తికి కారణమైంది.

ప్రభుత్వ ఆదేశాలు పెడచెవిన..

జిల్లాలో రెండు ఏరియా వైద్యశాలలు, పీహెచ్‌సీలు 43, సీహెచ్‌సీలు 8, అర్బన్ హెల్త్‌సెంటర్లు 12 తోపాటు అధికారికంగా గుర్తింపు పొందిన ప్రైవేటు వైద్యశాలలు 116 ఉన్నాయి. గుర్తింపులేని ప్రైవేటు వైద్యశాలలు, ఆర్‌ఎంపీలు సుమారు 250 పైనే ఉంటారు. వాటిల్లో ఒక్క బాపట్లలోనే 15 గుర్తింపులేని వైద్యశాలలను గుర్తించి వాటికి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలో రోగికి వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం రోగికి మలేరియా, డెంగీలతోపాటు ప్రాణాంతక వ్యాధులు వ్యాపించినట్లు గుర్తిస్తే వెంటనే ఐహెచ్‌ఐపీ (ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్) లో సంబంధిత రోగి వివరాలు, ఊరుపేరు, మండలం, జిల్లా, ఆ రోగి ఏ జ్వరంతో బాధపడుతున్నాడో.. రోగికి చేసిన పరీక్షల నివేదికలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. బాపట్ల జిల్లాలో అసలు ఐహెచ్‌ఐపీ పోర్టల్ ఉందనే విషయమే చాలామంది వైద్యాధికారులకు తెలియదు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఈ పోర్టల్‌లో వచ్చిన నివేదికల ఆధారంగానే డెంగీ పాజిటివ్ కేసులను పరిగణిస్తున్నారు.

మాత్రలు మాత్రమే..

ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నొప్పులు, వాపుల సమస్యలతో విలవిలలాడుతున్నారు. జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ కీళ్ల నొప్పులు, మడిమె నొప్పులు, ఒంటినొప్పులు, కళ్లు, ముఖం ఉబ్బిపోవడం, చర్మంపై దద్దుర్లు రావడం, ముఖం రంగుమారిపోవడం, మచ్చలు పడటం లాంటి సమస్యలతో బాధపడుతున్నారు. జ్వరాలు బాగా ఎక్కువగా ఉన్నచోట మాత్రమే ప్రభుత్వం క్యాంపులు నిర్వహిస్తోంది. అదికూడా ట్యాబ్లెట్లు మాత్రమే ఇస్తున్నారు. దీంతో విసుగుచెందిన రోగులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు.



బాపట్ల జగనన్న కాలనీ సమీపంలో పేరుకుపోయిన చెత్త



బాపట్ల ఏరియా వైద్యశాల ఓపీ నమోదు కేంద్రం వద్ద బారులు తీరిన రోగులు

ఈనెల 5 నుంచి 23వరకు నమోదయిన జ్వరాల వివరాలు..	
డెంగీ కేసులు :	28
టైఫాయిడ్ :	79

డెంగీని బూచిగా చూపి రూ.వేలల్లో వసూలు

ప్రైవేటు హాస్పటల్స్‌లో రోగి చెప్పిన లక్షణాలను బట్టి వారి దగ్గర డెంగీ నిర్ధారణ చేసే పరికరాలు లేకపోయినప్పటికీ డెంగీ జ్వరమేనంటూ నమ్మించి ఒక్కొక్కరిని 10 రోజులపాటు వైద్యశాలలో ఉంచుకొని వారి వద్ద నుంచి రూ. 50వేలు పైగా వసూలు చేస్తున్నారు. కొన్ని కార్పొరేట్ వైద్యశాలల్లో అయితే రూ.లక్షపైనే వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇప్పటివరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు కనీసం ప్రైవేటు వైద్యశాలల్లో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు.

డెంగీతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



జె.లక్ష్మి (ఫైల్)

జిల్లాలో డెంగీ కేసులు ప్రజలను వణికిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 23 వరకు మొత్తం జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 93 కేసులు మాత్రమే నమోదైనట్లు లెక్కలు చూపించారు. వాటిల్లో ఈ నెల 5 నుంచి 23వ తేదీలోపు 28 కేసులు నమోదయ్యాయి. బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త జె.లక్ష్మి డెంగీ జ్వరంతో మృతిచెందితే వైద్యాధికారులు అనారోగ్య కారణాలతో మృతి చెందిందంటూ నివేదికలు తయారుచేసే ప్రయత్నం చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మృతురాలి కుటుంబసభ్యులు ఏ ఆధారంతో డెంగీ కాదనిచెప్పారని నిలదీయడంతో చేసేదేమిలేక డెంగీ జ్వరమే అంటూ నిర్ధారించారు. ఆమె మృతి తర్వాత ఒక్క ముత్తాయపాలెం గ్రామం నుంచి ముగ్గురిని బాపట్ల ఏరియా వైద్యశాలకు పిలిపించి డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించగా ముగ్గురికి పాజిటివ్ వచ్చింది. దీంతో భయభ్రాంతులకు గురైన గ్రామంలో జ్వరపీడితులు బాపట్ల, చీరాల, చెరుకుపల్లి, గుంటూరుల్లోని ప్రైవేటు వైద్యశాలల్లో చేరి చికిత్స పొందుతున్నారు.



బాపట్లలో రక్తపరీక్షల కోసం బారులు తీరిన రోగులు

డెంగీ జ్వరంతో ఆస్పత్రిలో చేరా..



మాది కొల్లూరు మండలం, నాకు బాపట్ల మండలం, అప్పికట్ల గ్రామంలో బంధువులు ఉన్నారు. నేను బంధువుల ఇంటికి వచ్చాను. నాకు మూడు రోజులపాటు తీవ్రమైన జ్వరం, ఒళ్లంతా నొప్పులు వచ్చాయి. బాపట్ల వచ్చి పరీక్షలు చేయిస్తే వైద్యశాలలో చేరాలన్నారు. ఇప్పటికి వారం రోజుల నుంచి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాను. వైద్యాధికారులు పరీక్షలు చేసి డెంగీ జ్వరం అని చెప్పారు. ఇక్కడే ఉండి చికిత్స పొందాలన్నారు.

– లత, కొల్లూరు

డెంగీ లక్షణాలు ఉన్నాయన్నారు..



నాకు మూడు రోజుల నుంచి చలి, జ్వరం. వీటితోపాటు కాళ్లు, ముఖం వాపు వచ్చింది. పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చూపించుకున్నాను. అయినా జ్వరం తగ్గలేదు. ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తే కణాలు తగ్గిపోయాయి. నీకు డెంగీ లక్షణాలు ఉన్నాయన్నారు. ఆర్థిక స్తోమతలేక ప్రభుత్వ వైద్యశాలలోనే చేరి రెండు రోజుల నుంచి చికిత్స పొందుతున్నాను.

– శివనాగేంద్రమ్మ, మచ్చావారిపాలెం

ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో మందులు



వైరల్, డెంగీ జ్వరాలకు సంబంధించి ప్రభుత్వ వైద్యశాలల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. డెంగీ జ్వరాన్ని నిర్ధారించే పరికరాలు బాపట్ల, చీరాలలోని ఏరియా వైద్యశాలల్లో మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే బాపట్లలో గుర్తింపులేని 15 వైద్యశాలలకు నోటీసులు జారీచేశాం. జ్వరాలతో వైద్యశాలకు వచ్చే రోగుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేసే ప్రైవేటు వైద్యశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

తూతూమంత్రంగా ఉపాధి హామీ సభలు

- ఉపాధి కూలీల పొట్టకొట్టేలాప్రతిపాదనలు
- వైఎస్సార్ సీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



వేమూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: రాష్ట్రంలో తూతూ మంత్రంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు జరిగాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం గ్రామ సభల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కేవలం రూ.4500 కోట్లకు మాత్రమే ప్రతిపాదనలు పంపారని, దీనివల్ల కూలీలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రూ.10 వేల కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్లుయితే కూలీలకు న్యాయం జరిగేదన్నారు. అందులో రూ. 6 వేల కోట్లు ఉపాధి కూలీలకు వేతనాలకు, రూ. 4 వేల కోట్లు మెటీరియల్ ఖర్చుకు వాడేందుకు ఉపయుక్తంగా ఉండేదన్నారు. ప్రస్తుతం పంపిన ప్రతిపాదనల వల్ల ఉపాధి కూలీల వేతనాలకు రూ.2500కోట్లు, మెటీరియల్ ఖర్చుకు రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020-21 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం గ్రామ సభల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ 10,365 కోట్లు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ 10,365 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు.

ఇతర రాష్ట్రాలకు తరలించేందుకే ఉచిత ఇసుక విధానం

ఇతర రాష్ట్రాలకు ఇసుకను తరలించి, పెద్ద ఎత్తున అక్రమార్జన చేసేందుకే ఉచిత ఇసుక విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకొని వచ్చారని వరికూటి అశోక్‌బాబు అన్నారు. పేరుకే అది ఉచిత ఇసుక పథకమని, అధిక ధరకు ఇసుకను అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. క్షేత్రస్థాయిలో ఇసుకను చేరవేసుకుంటున్న లబ్ధిదారులే దానికి సాక్షులన్నారు. కోగంటి లవకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, ఆళ్ల రామ వెంకట రమణా రెడ్డి, మోదుకూరి హరిబాబు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: పరిశ్రమలలో ప్రమాదాల నివారణపై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణపై అనుబంధ శాఖల అధికారులతో ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలలో మానవ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. విపత్తులు, ప్రమాదాలు జరిగిన తర్వాత సహాయక చర్యల కంటే ముందస్తు సంరక్షణ చర్యలు ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెడ్, ఆరెంజ్ కేటగిరీల్లో ఉన్న పరిశ్రమలను అధికారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణం చట్టి ప్రకారం ఆయా పరిశ్రమలు నిర్వహిస్తున్నాయా అనే అంశాలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పరిశ్రమల నుంచి ప్రమాదకర ఉద్గారాలు వెలువడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాపట్ల జిల్లాలో పరిశ్రమల ద్వారా ఏ వ్యక్తికి ఎటువంటి హాని జరగరాదని, ప్రాణ నష్టం ఉండరాదని చెప్పారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై.రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోలాహలం కొనసాగు

దమ్ము చేస్తున్న రైతు





వరినాట్లు వేస్తున్న కూలీలు

బెంగాలీ విధానంలో నాట్లు వేస్తున్న దృశ్యం



తెల్లగ తెలవారకముందే పల్లె మేల్కొంది.. మెల్లగా ముల్లె సర్దుకుని, హలాలన్నీ భుజాన వేసుకుని కర్షక, కార్మిక లోకం పొలం బాట పట్టింది. ట్రాక్టర్లతో దమ్ము పట్టే పనిలో కొందరు.. లయబద్ధంగా వంగుతూ లేస్తూ మధ్యమధ్యలో కూనిరాగాలు తీస్తూ నాట్లు వేసేవారు మరికొందరు.. ఇలా ప్రతి పల్లె శ్రామిక సౌందర్యానికి ప్రతిబింబంగా దర్శనమిచ్చింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బెంగాలీ నాట్లు వేస్తూ కనిపించగా, మరికొన్నిచోట్ల వెదసాగు చేపట్టారు. ఆయా గ్రామాల్లో కనిపించిన దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– పిట్టలవానిపాలెం

క్లుప్తంగా

బాపట్ల ఎస్‌బీ సీఐగా జి. నారాయణ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా ఎస్‌బీ సీఐగా జి.నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో టీటీడీ విజిలెన్స్‌లో విధులు నిర్వర్తించిన నారాయణ గుంటూరు రేంజ్ ఐజీ ఉత్తర్వుల మేరకు రేంజ్ వీఆర్ నుంచి బాపట్ల ఎస్‌బీ సీఐగా నియమితులయ్యారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌బీ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



పర్చూరు: పూటుగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చినగంజాంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చినగంజాం చుండి బజారుకు చెందిన నిడుబ్రోలు వెంకట సుబ్బారావు (43) గత కొంత కాలంగా సూళ్లూరుపేటలో దర్జీగా పనిచేస్తూ ఇటీవల చినగంజాం వచ్చాడు. శనివారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఎటువంటి ఆహారం తీసుకోకుండా ఇంటిలో నిద్రపోయాడు. ఆదివారం ఉదయం అతని బంధువులు నిద్రలేపే ప్రయత్నం చేయగా మృతిచెందినట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని అతని భార్య లక్ష్మికి తెలియజేయడంతో ఆమె ఊరి నుంచి వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు.

రసవత్తరంగా కృష్ణా, ప్రకాశం మ్యాచ్



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంటర్ జోన్ అండర్-23 క్రికెట్ పోటీల్లో భాగంగా కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ రసవత్తరంగా మారింది. కృష్ణా జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 229 పరుగులకు ఆలౌట్ అయింది. నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ రెండు వికెట్లు నష్టానికి 38 పరుగులు చేసిన ప్రకాశం జట్టు ఆదివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఎన్.నిఖిల్ 10 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో నాటౌట్‌గా నిలువగా, జి.పార్థసారథి 42 పరుగులు సాధించాడు. కృష్ణా బౌలర్ మానస్ మూడు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 19 పరుగుల ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు నష్టపోయి 159 పరుగులు చేసింది. జట్టులోని ఆర్యన్‌సాయి 78 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. ప్రకాశం బౌలర్ పి.నవీన్ 3వికెట్లు సాధించాడు. సోమవారం మూడోరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పోలీసు రక్షణ కల్పించాలి



అత్యవసర సేవలు అందించే సమయంలో మహిళా వైద్యులకు రాత్రిళ్లు పోలీసు రక్షణ కల్పించాలి. రోగుల బంధువులు కొందరు మద్యం సేవించి ఆస్పత్రికి వస్తారు. ఒక్కోసారి వారివల్ల ప్రమాదం ఏర్పడవచ్చు. అందువల్ల రాత్రిళ్లు ప్రభుత్వ వైద్యశాలల్లో పోలీసులతో రక్షణ కల్పించాలి.

– డాక్టర్ ఫాతిమా, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, వేమూరు



ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి



వైద్యులపై దాడులు జరగడం బాధాకరం. ఎల్లవేళలా సేవలు అందించే వైద్యులు, వైద్యసిబ్బందికి మనోధైర్యం కల్పించటం పాలకుల బాధ్యత. దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. రోగులకు సేవలు అందించే సమయంలో పలువురు రోగుల సహాయకులు దౌర్జన్యంగా వ్యవహరిస్తుంటారు. అటువంటి దురాగతాలు అరికట్టేందుకు తగిన భద్రత కల్పించాలి.

– కంచర్ల ప్రవీణ, స్టాఫ్‌నర్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రేపల్లె

గోడు వినరూ.. గూడు కల్పించరూ..!

- యానాది సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాల దీనగాథ
- ఎండనకా వాననకా కాల్వగట్లపైనే జీవనం
- స్థలాలిస్తామంటూ ఓట్లు వేయించుకుని, పట్టించుకోని టీడీపీ నేతలు



స్థలం కేటాయించాలని అధికారులను వేడుకుంటున్న యానాది సామాజిక వర్గీయులు

చీరాల రూరల్: వారంతా అక్షరం ముక్క తెలియనివారు. ఎటువంటి ఆవాసం లేకుండా కాలువ గట్లపై నివాసం ఉంటూ చేపలు పట్టుకుంటూ జీవిస్తారు. పనులు లేకపోవడంతో పాటు కాలువ గట్లను ఖాళీ చేయాలంటూ అక్కడి నుంచి వారిని తరిమేశారు. చేసేదేమిలేక వారంతా తట్టా బుట్టా సర్దుకుని పొట్ట చేతపట్టుకుని పనుల కోసం జనావాసాల మధ్యకు వచ్చారు. ఏదో పని చేసుకుంటూ ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వీరిపై భూ యజమానులు కన్నెర్ర జేశారు. తమ స్థలం ఖాళీ చేయాల్సిందేనని హుకూం జారీచేయడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

ఈపూరుపాలెం కాలువ గట్టుపై..

చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీలోని ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ గట్టుపై 20 యానాది సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు నివాసముంటున్నాయి. వారంతా ఆ కాలువ గట్టుపై చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాలువలో చేపలు పట్టుకోవడం, చిన్నపాటి పొలం పనులు చేసుకుంటూ వచ్చిన దానితోనే తింటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు.

అయితే ఏమయిందో ఏమో గానీ వారందరినీ అధికారులు ఖాళీ చేయించారు. దీంతో దిక్కు తోచని వారంతా ఏం చేయాలో తెలియక మిన్నకుండిపోయారు. పొట్టచేత పట్టుకుని ఉపాధి వెదుక్కుంటూ వలసబాట పట్టారు.

కొత్తపేటలోకి మకాం..

ఆ 20 కుటుంబాలు చీరాల కొత్తపేటలోని కల్యాణ మండపం సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో స్థల యజమానులను బతిమలాడుకుని తాత్కాలికంగా చిన్నపాటి గుడిసెలు వేసుకున్నారు. గత రెండేళ్లుగా అక్కడే నివాసముంటున్నారు. కొన్ని కుటుంబాల వారు అపార్టుమెంట్లకు కాపలాగా ఉంటుండగా, మరికొందరు ఇళ్లల్లో పాచిపనులు చేసుకుంటూ ఎండనకా వాననకా కాలం అక్కడే గడుపుతున్నారు. అయితే సంబంధిత స్థల యజమానులు తమ స్థలాలు ఖాళీ చేయాల్సిందేనంటూ ఆదేశించడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ఓట్లు దండుకున్నారు..

ఇటీవల జరిగిన ఎన్నికలలో అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ ఆశ చూపించి టీడీపీ నాయకులు వారితో ఓట్లు వేయించుకున్నారు. వారి మాయ మాటలు నమ్మినవారంతా మారు మాట్లాడకుండా గుంపగుత్తగా టీడీపీకి ఓట్లు వేశారు. ఇప్పుడు కనీసం మాట్లాడటానికి కూడా ఒక్క నాయకుడు మా వద్దకు రావటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

స్థలాలు ఇచ్చి ఆదుకోవాలి..

ఎక్కడా సెంటు స్థలం కూడాలేని మాలాంటి పేదవాళ్లకి ఉండటానికి కొద్దిపాటి స్థలం ఇస్తే చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తాం. ఎక్కడకు వెళ్లినా మమ్మల్ని ఖాళీచేసి వెళ్లమంటున్నారు. ఏ జన్మలో ఏ పాపం చేశామో తెలియదు కానీ ఈ జన్మలో మాకు దేవుడు ఈ కష్టాలు పెట్టాడు. ఉండటానికి కాస్త స్థలం ఇచ్చి ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. – సుబ్బారావు

స్థలాలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు

రెండు నెలల కిత్రం జరిగి ఎన్నికలలో టీడీపీ వారు మాకు స్థలాలు ఇప్పిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఎన్నికలు అయిపోయాక మా వద్దకు ఒక్కరూ కూడా రాలేదు. మా గురించి పట్టించుకున్న వారెవరూ లేరు. ఇక్కడి నుంచి ఖాళీచేస్తే పిల్లా పాపలతో ఎక్కడికి వెళ్లి తలదాచుకోవాలో తెలియడం లేదు. – పార్వతి

వందరోజుల లక్ష్యంతో ముందుకు సాగుదాం

జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



చెక్కు అందిస్తున్న జేసీ బి.సుబ్బారావు

బాపట్ల: కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశం అనంతరం లక్పతి దీదీలకు, సీఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మొత్తం లక్పతి దీదీ 100 రోజుల లక్ష్యం 1,22,160 మందికాగా వారిలో బాపట్ల జిల్లాకు 4628 మందిని లక్ష్యం ఇచ్చారని జేసీ తెలిపారు. వీరికి వంద రోజుల్లో జీవనోపాధికి కావలసిన నిధులు సీఐఎఫ్, వీఆర్ఎఫ్, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా ఏర్పాటు చేసి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బాపట్ల జిల్లాలోని 305గ్రూపులలో ఉన్న లక్పతి దీదీ లకు రూ.62.75కోట్లు చెక్కును ఈసందర్భంగా అందించారు. డీఆర్‌ఓ సీహెచ్.సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, అధికారులు బి.ద్రాక్షావలి, ఎన్.స్వర్ణ కుమారి, సిహెచ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

- నిందితుల్లో ముగ్గురు మైనర్లు
- రెండు కిలోల గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం

రేపల్లె రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురును అరెస్ట్ చేసి వారి వద్ద రెండు కిలోల గంజాయితో పాటు ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని బేతపూడిలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం సమీపంలో పలువురు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో తమ సిబ్బందితో శనివారం సాయంత్రం దాడులు నిర్వహించామన్నారు. దాడులలో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా వీరిలో ముగ్గురు బాలురు ఉన్నట్లు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకూన గ్రామానికి చెందిన ఆళ్లమూడి సుదర్శన్, పులివర్తి రాధాకృష్ణ, రేపల్లె మండలం బేతపూడికి చెందిన కనపర్తి సుగుణరాజులతో పాటు ముగ్గురు బాలురును అదుపులోకి తీసుకున్నామన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకూనకు చెందిన మైనరుతో పాటు కలగట్ల భానుప్రకాష్‌లు పాడేరు నుంచి గంజాయిని తెప్పించి మిగిలిన వారికి విక్రయిస్తుంటారని, అదుపులోకి తీసుకున్న వ్యక్తులు వీరి వద్ద గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తుంటారని తమ విచారణలో తేలిందన్నారు. కలగట్ల భాను ప్రకాష్ పరారీలో ఉన్నాడని, అతన్ని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కుమారుడికి స్వల్పగాయాలు



తీవ్ర గాయాలకు గురైన క్షతగాత్రుడు

కొల్లూరు: ద్విచక్ర వాహనం.. ఎదురుగా వస్తున్న టాటా మేజిక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలవ్వగా, అతని కుమారుడు స్వల్ప గాయాలకు గురై అపస్మారక స్థితికి చేరుకొన్న సంఘటన మండలంలోని దోనేపూడిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంకకు చెందిన రాము ఏసుబాబు తన నాలుగేళ్ల కుమారుడితో ద్విచక్ర వాహనంపై భట్టిప్రోలు మండలం వెల్లటూరు వైపు నుంచి తన స్వగ్రామం వెళుతున్నాడు. కొల్లూరు వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో కొల్లూరు నుంచి వెల్లటూరు వైపు వెళుతున్న మేజిక్ వాహనం ఎదురుగా దూసుకువచ్చింది. ఎదురుగా వచ్చిన వాహనాన్ని ఢీకొట్టకుండా ద్విచక్ర వాహనాన్ని అదుపు చేసేందుకు ఏసుబాబు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో టాటా మ్యాజిక్ వెనుక భాగం ద్విచక్ర వాహనానికి తగిలి ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఏసుబాబు కుడి కాలితోపాటు, శరీరంలో పలు చోట్ల తీవ్రగాయాలవగా, అతని కుమారుడు సాయి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అయితే ప్రమాదం కారణంగా భయకంపితుడైన నాలుగేళ్ల బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానికులు బాలుడికి పరిచర్యలు చేయడంతో సాధారణ స్థితికి చేరుకున్నాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులతో పాటు, పెసర్లంకకు చెందిన వ్యక్తులు క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి క్షతగాత్రుడితోపాటు, అతని కుమారుడిని 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

ప్రత్తిపాడు: తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. చలపతి కళాశాల సౌజన్యంతో ఆనంద్ చెస్ వింగ్స్, రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మోతడకలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి 255 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రానికి ఆరు రౌండ్లకుగాను 6 పాయింట్లతో షణ్ముఖ (హైదరాబాద్) మొదటి స్థానంలో, 5.5 పాయింట్లతో ధ్రువేష్ (గుంటూరు), జె.మల్లేశ్వరరావు (విజయవాడ), ఎం. శ్రీనివాసరెడ్డి (గుంటూరు)లు ద్వితీయ స్థానంలో కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సుమన్, చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ రామారావు, ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం. గోపీనాథ్, అర్బిటర్స్ విజయ్‌కుమార్ అగర్వాల్, రామ్, కళాశాల సిబ్బంది నాదెండ్ల రామారావు, పీడీ భానుప్రకాష్, డి. రాము, అధ్యాపకులు దినేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



రేపల్లె రూరల్: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ప్రభుత్వ వైద్యశాల సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ఎ.మల్లికార్జునరావు వివరాల మేరకు ప్రభుత్వ వైద్యశాల కాంపౌండ్ గోడ వద్ద సుమారు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వృద్ధుడు మృతి చెంది ఉన్నాడన్నారు. మృతుడు గత నాలుగు రోజులుగా సమీప ప్రదేశాలలో సంచరించినట్లు సమాచారం ఉందన్నారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. మృతుడు ఎర్ర రంగు బనియన్, ఆకుపచ్చ రంగు నిక్కరు ధరించి ఉన్నాడని చెప్పారు. గుర్తించినవారు ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉన్న మృతదేహాన్ని తీసుకెళ్లాలని చెప్పారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- డీఎంకే ఎంపీ విల్సన్ డిమాండ్
- ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు



బీపీ మండల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంకే ఎంపీ విల్సన్, సేన నాయకులు

ప్రత్తిపాడు: బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని తమిళనాడు రాష్ట్రానికి చెందిన డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి. విల్సన్ అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని గుంటూరులో ఆదివారం మండల సేన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అమరావతి రోడ్డులోని బీపీ మండల్ సర్కిల్‌లో ఉన్న కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బండ్లమూడి గార్డెన్స్‌లో సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విల్సన్ మాట్లాడుతూ.. ఇప్పటికీ 1931 జనాభా లెక్కల దామాషా ప్రాతిపదికనే రిజర్వేషన్లు కొనసాగించటం దారుణమన్నారు. కేంద్రానికి ప్రస్తుత జనాభా ప్రాతిపదికన అమలు చేసే ఉద్దేశం లేక బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బీపీ మండల్ నివేదిక ప్రకారం 52 శాతం జనాభా కలిగిన బీసీలకు 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా కేవలం 27 శాతానికే పరిమితం చేయటం తగదన్నారు. ఎవరూ డిమాండ్ చేయకుండానే అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీపీ మండల్ సేన అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కేసన శంకరరావు, దాసరి శివకుమార్, సీనియర్ న్యాయవాది వై. కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది వై. తాగూర్ యాదవ్, జిల్లా కోర్టు న్యాయవాది ప్రసాదరావు, రంగయ్య, కె సుబ్రమణ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

- ఒకరికి తీవ్ర గాయాలు
- రూ. 28లక్షల ఆస్తి నష్టం



వెంకటేశ్వర్లును వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రాజశేఖర్ నాయక్

వెల్దుర్తి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధంతో పాటు వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గుండ్లపాడులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు ఇంటిలో షార్ట్ సర్క్యూట్‌తో కావటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. 20 సవర్ల బంగారం, రూ. 10లక్షల నగదు, రెండు ల్యాప్‌ట్యాప్‌లు, పొలం పాసు పుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్లు, దుస్తులు, విలువైన డాక్యుమెంట్లు, నిత్యవసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ. 20లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు వాపోయారు. ఆయన సోదరుడు జవిశెట్టి బ్రహ్మయ్య ఇంటికీ మంటలు వ్యాప్తి చెందడంతో ఎనిమిది సవర్ల బంగారం, రూ. 4లక్షల నగదుతో పాటు సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు, నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజశేఖర్ నాయక్, వీఆర్వో వెంకటరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం ప్రమాదంలో గాయపడి మాచర్లలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును పరామర్శించారు.

బైక్ దొంగిలించిన యువకుడికి దేహశుద్ధి

పోలీసులకు అప్పగింత



అచ్చి అంకమ్మను నిర్బంధించిన దృశ్యం

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి అమ్మేందుకు యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన శనివారం రాత్రి గణపవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాట్రు వెంకటేశ్వర్లు కుటుంబంతో కలిసి ఈ నెల 22న చిలకలూరిపేటలో ఫంక్షన్‌కు వెళ్లారు. ఈ సమయంలో గ్రామంలో ఇంటి ముందు తన బైక్‌ను ఉంచారు. రాత్రి 11 గంటలకు తిరిగి చేరగా వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన అచ్చి అంకమ్మ, వెంకటేష్ వాహనాన్ని దొంగిలించి, అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు గమనించి వాహన యజమానికి సమాచారమిచ్చారు. దీంతో అచ్చి అంకమ్మను పట్టుకుని ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని విద్యుత్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అయితే, వాహనాన్ని దొంగిలించినది తాను కాదని, వెంకటేష్ అని, తాను అమ్మేందుకు ప్రయత్నించానని చెప్పాడు. గతంలో అంకమ్మపై పలు దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



జాని మృతదేహం

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ షేక్ జాని(45) ఉరఫ్ ఆటో జాని మృతి చెందాడు. మండలంలోని గోగులపాడుకు జాని సంతమాగులూరు అడ్డరోడ్డులో ఉన్న బంధువుల్ని తీసుకొచ్చేందుకు ఆటోలో బయలుదేరాడు. అన్నవరప్పాడు గ్రామ సమీపంలోకి రాగానే రోడ్డు పక్క ఆగి ఉన్న లారీని అధిగమించే క్రమంలో దాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జానీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని 108 అంబులెన్స్‌లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ జాని మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ చార్జీల విడుదలకు ఏఐఎస్ఎఫ్ డిమాండ్

28న రిలే నిరసన దీక్షకు నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు

లక్ష్మీపురం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 28వ తేదీన రిలే నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్తపేటలో మల్లయ్య లింగంభవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంవత్సరాలుగా వసతిగృహ విద్యార్థులకు సామగ్రి పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. 2023 నవంబర్ నుండి మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేవారు. ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని కోడిగుడ్ల సత్రంలో ఉన్న సమీకృత సంక్షేమ హాస్టల్ భవనానికి రూ.కోటి కేటాయించి తక్షణమే పూర్తి చేయాలన్నారు. వచ్చిన విద్యార్థులకు వసతి కల్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గాసాయి, అజయ్, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అంకాలమ్మ బోనాల ఉత్సవం



అమ్మవారికి బోనాలు సమర్పించడానికి వస్తున్న భక్తులు

కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. పల్నాటి రణక్షేత్రం శోభాయమానంగా మారింది. కుంకుమ బండ్లతో యువకులు గ్రామోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో, పూలతో అందంగా అలంకరించారు. కుంకుమ బండ్ల రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బండ్ల వెంట మహిళలు బోనాలతో తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం పోలేరమ్మ తల్లి, పాత పాటేశ్వరమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని, పాడిపంటలతో లోగిళ్ల కళకళలాడాలని మహిళలు పూజలు చేశారు.